5. ఆ ప్రకారమె నీదు నామము – నందు కాలము చేసి = యా ప్రజలు దేహములు మహిమను – నందఁ జేయుము రక్షకా ॥కోఁత॥

6. కోఁత కార్యమువల్ల గూడను – కూర్మిచే నీ బిడ్డలు = నీతులను నేర్వంగఁ జేయుము – ప్రీతిగల మా రక్షకా ॥కోఁత॥

7. దూత లంత్య దినంబునందున – కోఁత గోయుదు రంతట = నా తరుణ మున గురుగు లన్నియు – నగ్నిలోఁ బడవైతురు ॥కోఁత॥

8. లోకమందలి గాలి వానల – లోను మే మిఁక నుండక = నాకమందున దండ్రి మింటను – నేకముగ జీవింతుము ॥కోఁత॥

9. నీవు నేర్పిన యట్లే మే మిల – నిన్నుఁ బ్రతిదినమందును = జీవనోపాయంపు భుక్తిని – దేవ, వేఁడఁగఁ జేయుమీ ॥కోఁత॥

10. మేఇన నేఁ బోషించు నన్న – పానములనే వేఁడక = జానుగా నాత్మలకునౌ భో – జనము వేఁడఁ నీయుమీ ॥కోఁత॥

11. వసుధ నినుఁ బ్రార్థించు జన జీ – వంపు రొట్టెవు నీవెగా = అనువు నాదరణంబు భుక్తిని – యగుము మా కిల నెప్పుడున్ ॥గోఁత॥

– *కడియం గాబ్రియేలు*

## 582 వందనార్పణము

రా –హరికాంభోజి తా –ఆది

నుతి సేయను లేవే – యో మనసా – నుతిఁజేయను లేవే = క్షితిని దివిని – హితమతిఁ బ్రోచెడి – సుతుని జనకుని – శుద్ధాత్మునిఁ ద్రేకుని ॥నుతి॥

1. సూర్యుని కాంతి – సొంపగు పంటలు – సుకాలక్షేమముల్ – శోభిలు గేహమున్ = ఆర్య సాంగత్యము – నైశ్వర్యముల నిల – ననుభవింపవె నీవా – యాధ్యుని పేర్మిని ॥నుతి॥



2. దురితము లందె – దుర్గతి నున్న నీ – కురుతర ప్రేమను – బరమార్థ మీయను = వరపుత్రు నొసఁగఁడె – వందనీయుఁడు ప్రభు – మరిమరి మ్రొక్కు మా – పరమోపకారిని ॥నుతి॥

3. జీవము జ్ఞానము – జీవము నొసంగెదు – పావనాత్మను నీకై – పంపిన దేవు డు = కేవల దోష స్వ –భావము మార్చఁడె – సేవ జేయుమ నీవా – పావనమూర్తికి ॥నుతి॥

4. కరములు పదముల్ – కనకాదు లన్నియు – స్వరమును చిత్తము – స్థిరమగు ప్రేమయు = మరి నీదు హృదయము – పరమాత్ము సేవకై – పరిపూర్ణముగ నిచ్చి – ప్రణుతించు మాయనన్ ॥నుతి॥

– *వంతగాని పరదేశి*

## 583 కోఁత పండుగ

రా –శంకరాభరణము తా –ఆది

యెహోవ సన్నిధిని – నీ స్తోత్రగానముతో = మహోపకారునకు – మానుగ నర్పణ సమర్పించుఁడి ॥యెహోవ॥

1. ప్రభు వడుగు నర్పణలు – ప్రేమ కృతజ్ఞతలు = అభయ ప్రధానములు – విభునకు నియ్యుఁడు విరివిగను ॥యెహోవ॥

2. రిక్తహస్తములతో – రావలదు సన్నిధికి = భక్తవత్సలునకు – శక్తికొలఁది మీ రర్పించుఁడి ॥యెహోవ॥

3. శృంగారాలయ మిలలోఁ – పొంగారఁ గట్టుటకు = బంగారు వెండి యును – బాగుగ నియ్యుఁడి ప్రభుపేర ॥యెహోవ॥

4. వరుమానములచేత – వాంఛింప వలదండి = గురు నాజ్ఞ చొప్పునను – విరివిగ హృదయము లర్పించుఁడి ॥యెహోవ॥

5. యెహోవ జనులారా – యియ్యుండి మనసార = యెహోవ యిచ్చి నది – యేసున కర్పణ చెల్లింతము ॥యెహోవ॥

– *గుంజా వెంకటరత్నము*